మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



# ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**కుళ్లిన మృతదేహం.. సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం**

**అల్లాదుర్గం, అక్టోబరు 4,ప్రభాతవార్త:**

ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం...అల్లాదుర్గం గ్రామానికి చెందిన ఎంబరి లక్ష్మణ్(23) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. 10 రోజుల క్రితం సంగారెడ్డికి వెళ్లి కూలి పని చేసుకుని దసదా పండగకు కొత్త బట్టలు తీసుకొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన లక్ష్మణ్ శుక్రవారం గ్రామ సమీపంలోని పటేల్ చెరువులో శవమై తేలాడన్నారు. చెరువులో మృత దేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీ సులు మృతదేహాన్ని నుంచి వెలికి తీసి పరిశీలించగా లక్ష్మణ్‌గా గుర్తించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో వైద్యులను సంఘటన స్థలానికి రప్పించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి వివరించారు.

# దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

**కొల్చారం, అక్టోబరు 4 ప్రభాతవార్త:** దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలని, దుర్గా మాత కృపకటాక్షాలు ఈ ప్రాతమంతా పడి పాడిపంట లతో సుభిక్షంగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవా ల్లో భాగంగా ప్రతిష్టించిన దుర్గామాతను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి దర్శిం చుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు సునితా లక్ష్మారెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సునితా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి కృపకటాక్షాలతో ప్రజలందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్ గుప్త, యువత విభాగం అధ్యక్షులు కోనాపూర్ సంతోష్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ కుమార్, ముత్యంగారి సంతోష్ కుమార్, రంగంపేట సొసైటీ వైస్ చైర్మన్ మెతుకు మల్లేశం, పార్టీ సీనియర్ నేతలు నరేందర్‌రెడ్డి, సంతోష్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




సిఎం కప్ టార్చ్‌ర్యాలీని స్వాగతం పలుకుతున్న కలెక్టర్, చైర్మన్

## సంగారెడ్డికి చేరుకున్న సిఎం కప్ టార్చ్ ర్యాలీ

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రారంభించిన సిఎం కప్-2024 టార్చ్ ర్యాలీ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణానికి శుక్రవారం చేరుకుంది. సిఎం ప్రారంభించిన ర్యాలీ హైదరాబాద్ నుంచి వికారాబాద్ మీదుగా సంగారెడ్డికి చేరుకున్న ర్యాలీని పెద్దాపూర్‌లో జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలి కారు. త్వరలో నిర్వహించే సిఎం కప్ గురించి ప్రజల్లో అవగాహన పెంచాలని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొనేలా అవగహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్న ర్యాలీ ఇంచార్జి సిఐ మధు తెలిపారు. కార్యక్రమంలో టిజి ఐఐసి చర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షులు జావిద్ అలీ, ఓప పరమేష్, టిఎన్‌జిఓ నాయకులు వెంకట్‌రెడ్డి, విజయ్ కుమార్, ఆర్ఆర్ జిల్లా డివైఎస్ఓ వెంకటేశ్వర్లు, సిఎం కప్ కన్వాయ్ ఇంచార్జి సిఐ మధు, యువజన సంఘాల అధ్యక్షులు కూన వేణు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి బ్యూరో అక్టోబరు 4,ప్రభాతవార్త:** జిల్లాలో రోడ్డు ప్రమాద నివారణకు పకడ్బంది చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అయా శాఖల అధికారులు సమన్వయం కాగితాలకే పరిమితం కాకుండా, దృశ్యమాన చర్యల రూపంలో అమలు చేయాలని అన్నారు.ఎక్కువగా ప్రమాదాలుజరిగే ప్రాంతాలను గర్తించి,ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు, పాఠశాలలు,కళాశాలలో అవగాహన కార్యక్రమకాలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అబ్బుర పరిచేలా సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలి

**జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత భవనంలో అబ్బుర పరిచేలా అత్యున్నత స్థాయి సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా సైన్స్ ఫోరం, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సైన్స్ సెంటర్ అవశ్యకత, సైన్స్ సెంటర్ ఏ విధంగా రూపొందించాలి సైన్స్ సెంటర్‌లో ఉండా ల్సిన అంశాలు, వివిధ రకాల సలహాలు సూచనలు చేశారు. సైన్స్ సెంటర్‌లో ఉండే ప్రాజెక్టు వర్కింగ్ మోడల్‌గా ఉండాలని..సైన్స్ సెంటర్ పాఠశాల, కళాశాల స్థాయికి సమాజం నుంచి వచ్చే ప్రతి పౌరులు నేర్చుకునే విధంగా సైన్స్ సెంటర్ ఉండాలన్నారు. సమాజం లో అన్ని వర్గాల సైన్స్ సెంటర్‌ను సందర్శించేలా ఉండాలన్నారు. అత్యాధునిక పద్దతిలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కలగలుపుకొని ఒక మోడల్ సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి అన్ని విధాల సహ కారం ఉంటుందన్నారు. వివిధ ప్రాంతాల్లోని వివిధ రకాల సైన్స్ మ్యూజియంలను క్షేత్రస్థాయిలోపరిశీలించి ఒక నివేదిక ప్రకారం మాడల్ వన్ సైన్స్ సెంటర్ తయారీకి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రామస్వామి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, భౌతిక శాస్త్రం, జీవశాస్త్ర ఫోరంన, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులతో సమావేశం నిర్వహించిన ఆర్డీఓ

**హత్నూర, అక్టోబరు 4, ప్రభాతవార్త:** రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులతో శుక్రవారం హత్నూరలో మెదక్ ఇన్‌చార్జి ఆర్డీఓ రాజు సమావేశం నిర్వహించారు.భూములు కొలోతున్న రైతుల నుండి అభ్యంతరాలను స్వీకరించారు.పేర్ల నమోదులో పొరపాట్లు జరి గినా, సాగులో ఒకరు, పట్టాకాలంలో ఒకరు ఉన్నా తెలియ జేయాలని సూచించారు. రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం నుండి ఇప్పించేందుకు కృషిచేస్తామని ఆర్డీఓ రాజు అన్నారు. సమావేశంలో తహసిల్దార్ ఫర్వీన్ శేక్, డిజి దావుద్‌అహ్మద్, ఆర్ఐ శ్రీనివాస్, హత్నూర, దేవులపల్లి, సికింద్లాపూర్, కాసాల, దౌల్తాబాద్ గ్రామాలకు చెందిన రైతులు పాల్గోన్నారు.




మాట్లాడుతున్న ఆర్డీఓ రాజు

# ఫార్మాసిటీని అడ్డుకుంటాం..రైతులకు అండగా ఉంటాం

**మంత్రి తన్నీరు హరీష్‌రావు**

**న్యాల్‌కల్, అక్టోబరు 4, ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల శివారులో ఫార్మసిటీ ఏర్పాటును అడ్డుకుని రైతులకు అండగా బిఆర్ఎస్ నిలుస్తుందని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. డప్పూర్‌గ్రామంలో రైతులు చేపట్టిన రచ్చ బండ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్‌రావు, జహీరాబాద్, సంగారెడ్డి శాసనసభ్యులు కొనింటి మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, శాసనమండలి సభ్యులు యాదవ్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, నారాయణఖేడ్, అందోల్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతి కిరణ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై రైతులు సాగు చేసుకుంటున్న పంటలను(ఫార్మసిటీ కోసం తీసుకుంటామంటున్న భూములు) పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ పిచ్చోడి చేతిలో రాయి పెట్టినట్లుగా రాష్ట్రాన్ని రేవంత్‌రెడ్డికి అప్పగించినట్లయిందని వ్యంగంగా విమర్శించారు. ఫార్మసిటీ కొరకు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హైద్రాబాద్‌కు దగ్గరలో కాలుష్యం లేకుండా జీరో వ్యర్థాలతో 15వేల ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారని గుర్తు చేశారు. ఎంపిక చేసిన అనుమతులు వచ్చినచోట ఫార్మసిటిని ఏర్పాటు చేయకుండా సిఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా అక్కడి భూములను అమ్మేసుకునేందుకు, రైతులు మూడు పంటలను పండించుకుంటున్న భూముల్లో ఎలాంటి అనుమతులు పొందకుండా భూములను లాగేసుకునేందుకు కుట్రలు పన్నడం తగదని, కంపెనీ ఏర్పాటుకు బుల్‌డోజర్లు వస్తే ముందుగా తన పై, ఎమ్మెల్యే మాణిక్‌రావులపై నుంచి పోవాల్సి ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో ప్రభుత్వ భూములకు పట్టాలు ఇస్తా అన్నావు, ఇప్పుడేమో భూములు గుంజుకుంటున్నావు అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల రుణాలను మాఫీచేయడంలో, రైతుబంధు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేవుళ్ల మీద ఒట్టు వేసి ఆగస్టు 15 వరకు రుణాలు మాఫీ చేస్తా అని లేదా అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి మూడు వందల రోజులు నిండినా హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. కోహీర్ మండలం జామకాయలకు, డప్పూర్ పుదీనాకు పేమస్ అని హరీష్‌రావు గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆయా మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

## గ్రామ తాగునీటి సహాయకుల రాక..

**-తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నియమించిన ప్రభుత్వం**

**మెదక్ రూరల్, అక్టోబరు 4 ప్రభాతవార్త:** గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చర్యలు చేపట్టింది. ఈ మేరకు గ్రామల్లో చేతి పంపులు, విద్యుత్ మోటార్ల మరమ్మతులు, పైప్ లైన్ల లేకేజీలను అరికట్టడం, తాగునీటి నాణ్యత పరిశీలన, ట్యాంకులను శుభ్రపరచడం వంటి పనులు చేస్తూ మంచినీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకునేందుకు గ్రామ మంచినీటి సహాయకులను నియమించింది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నల్‌జల్‌మిత్ర పథకంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. గ్రామాల్లో త్రాగునీటి నాణ్యతను పరిశీలించడంతో పాటు చేతి పంపులు, విద్యుత్ మోటార్లు పాడైతే అదే రోజు మరమ్మత్తులు నిర్వహించేలా, పైపులైన్ల లీకేజీలను అరికట్టేలా గ్రామ మంచినీటి సహాయకులను ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా ప్రతి గ్రామానికి ఒకరు చొప్పున బహుళ నైపుణ్యం కలిగిన కార్మికుడిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు.

**నాలుగు రోజుల పాటు శిక్షణ...**

ఎంపిక చేసిన గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల పాటు శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణలో చేతి పంపులు, విద్యుత్ మోటార్ల మరమ్మ తులు, పైప్ లైన్ల లేకేజీలను అరికట్టడం, మంచినీటి నాణ్యత పరిశీలన తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.





పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

## పచ్చి రొట్టతో పంటకు బలం

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 4, ప్రభాతవార్త :** పచ్చి రొట్ట ఎరువులను భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చని అర్బన్ మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ అన్నారు. శుక్రవారం బక్రిచెప్యాల, రంగధాంపల్లిలో విత్తనోత్పత్తి వరి, జీలుగ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంటను సాగు చేయడానికి 45 రోజుల ముందు పచ్చి రొట్ట పైర్లు అయిన జనము,జీలుగ పిల్లి పెసరవంటి వాటిని పొలంలో పెంచి పూతదశలో భూమిలో కలియ దున్నడం ద్వారా పంటకు ప్రధాన పోషకాలు ఎక్కువ మొత్తంలో అందుతాయన్నారు. పచ్చి రొట్టే వ్యర్థాలు పైర్లను పెంచి భూమిలో కలియ దున్నుకోవడం ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవడంతో ఖర్చు తగ్గుతుందన్నారు. పంటలకు ఆశించే తెగులు,చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారులు అందించే సలహాలు సూచనలు పాటించాలన్నారు. సరైన యాజమాన్య పద్దతులు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజేష్, పవన్ తదితరులు ఉన్నారు.

# నాటు బాంబు తయారీదారుల ముఠా అరెస్ట్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 4, ప్రభాతవార్త**

నాటు బాంబులను తయారు చేస్తున్న వ్యక్తితో పాటు జంతువులు, వన్యప్రాణులను వెటాడుతున్న ముఠా సభ్యులైన ఐదుగురిని పట్టుకుని రిమాండ్‌కు పంపిచినట్లు హుస్నాబాద్ సిఐ కోంద్ర శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాత్రి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం హుస్నాబాద్ మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు గుట్ట పక్కన ఉన్న వ్యవసాయ క్షేత్రాల వద్ద జంతువులు,వన్యప్రాణుల కోసం నాటు బాంబులు పెట్టిన సందర్భంలో బాంబు పేలి వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయంపై అప్రమత్తమైన పోలీసులు బాదితుడి సహోదరుడు తాజుద్దిన్ నుండి ఫిర్యాదు తీసుకుని కేసు ధర్యాప్తు చేసి విచారణ ప్రారంభించారు. విచారణలో మీర్జాపూర్‌లోని ఓ ఇంట్లో రహస్యంగా దాచారని విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడకు చేరుకుని దాసిన బాంబులను స్వాదీనం చేసుకున్నారని, ఈ బాంబులు తయారు చేస్తున్న పిట్టల స్వామి,బధనపురం తిరుపతి,ఎరుకల తిరుపతి,కందుకూరి భాస్కర్, కుమ్మరి భాస్కర్, ఇటిక్యాల సతీష్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. వన్య ప్రాణులను జంతువులను వేటాడేందుకు నాటు బాంబులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్,కానిస్టేబుల్ నరేష్,హోంగార్డులు శేఖర్,రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ కోంద్ర శ్రీనివాస్

# విగ్రహ అపహరణ కేసులో ఐదుగురి అరెస్ట్

**టేక్మాల్, అక్టోబరు 4 ప్రభాతవార్త**

యువకులు చెడు మార్గాల్లో నడిచి వ్యసనాలకు బాసిగా మారి అత్యాశతో ఉన్న ఫలంగా డబ్బు సంపాదించాలన్నా ఆశతో విగ్రహాన్ని దొంగలించి దొరికిపోయారని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెల్పుగొండ గ్రామంలో పార్శ్వనాథుడు తీర్థం కర ఏకశిల విగ్రహం అపహరణకు గురైంది. కాగా మిస్టరీగా మారకముందే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టేక్మాల్ పోలీసులు ప్రత్యేక నిఘా విభాగంగా ఏర్పడి అపహరణకు గురైన విగ్రహాన్ని కనుగొనడంలో టేక్మాల్ పోలీసుల పాత్ర అభినంధనీయమన్నారు. వెల్పుగొండ గ్రామ శివారులోని చెరువు మధ్యలో పెద్ద దిగంబర అవతారంలో ఉన్న పార్శ్వనాథుడు తీర్థంకర ఏకశిల విగ్రహం ఉండేది. ఆగస్టు 30వ తేదిన గ్రామంలోని మేకల కాపాలదారులు అటు వెళ్లి చూడగా ఎప్పుడు ఇక్కడే ఉంటే విగ్రహం కనిపించడం లేదని అను కొని గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి గుర్తు తెలియని దుండగులు ఆ విగ్రహాన్ని ఆపరించుకుపోయారని గ్రామస్తుల ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏడాది క్రితం ఈ విగ్రహాన్ని దొంగిలించే ప్రయత్నం చేశారని తెలుసుకున్న పోలీసులు ఈ కేసును సవాలుగా తీసుకొని నెల వ్యవధిలో కేసు మిస్టరీని చేధించారు. చిలుకూరి అనువింద్, తోట జగత్, బందెల శుభానంద్, ఆచంట జిల్లా పశ్చిమ గోదావరి, పోలిశెట్టి తేజ సాయిబాబు, నారాయణరావునగర్, చల్లపల్లి, కృష్ణాజిల్లా జొన్నలగడ్డ మహేష్‌బాబు, పామర్రు, కృష్ణ జిల్లాలు బిటెక్ చదివిన ఐదుమంది యువకులు అత్యాశకు పోయి డబ్బు సంపాదించాలన్న దురాశతో యుట్యూబ్, సోషల్ మీడియాలో తెలుసుకొని ఈ విగ్రహ ఆపహరణకు ఒప్పుకున్నట్లు ఎస్పీ చెప్పారు. వారి పథకం ప్రకారం ఒక రోజు ముందే విగ్రహాన్ని వచ్చి చూసి వెళ్లారన్నారు. జూలై 26వ తేదీన మధ్యరాత్రి ఒక వాహనంలో విగ్రహాన్ని ఆపహరించుకు పోయారన్నారు. విగ్రహానికి సరైన ధర రాకపోవడంతో విగ్రహం అమ్మలేదన్నారు. విగ్రహాన్ని అమ్ముతున్న టేక్మాల్ ఎస్ఐ రాజేష్‌కు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకొని టేక్మాల్ పియస్‌లో విచారించగా జరిగిన విషయాలన్ని చెప్పారని ఎస్పీ ఉదయ్ కుమార్ తెలిపారు. విగ్రహం అపహరించుకుపోయిన ఐదుగురిని అరెస్ట్‌చేసి రిమాండ్ పంపుతున్నట్లు చెప్పారు. ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని విలువైన చోట్లతో పాటు ఇళ్ల వద్ద సీసీ కెమారాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇటీవల ఆలయాల్లోనజరిగిన దొంగతానాలకు సంబంధించిన మీస్టరీని కూడ చేధించడం జరుగుతుందన్నారు. ఇందులో మెదక్ డిఎస్పీ ఫణిందర్,, అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి, టేక్మాల్ యస్ఐ రాజేష్, ఎయస్ తుక్కయ్య, కానిస్టేబుళ్లు కంటేష్, శ్రీనివాస్‌లతో పాటు తదితర సిబ్బంది ఉన్నారు.




వివరాలు తెలుపుతున్న ఎస్పీ, చిత్రంలో నిందితులు(ముసుగేసుకున్నవారు)




మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం

## కార్మికుల సంక్షేమమే సిఐటియు లక్ష్యం

**-జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం**

**జహీరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బూచినెల్లి గ్రామ పరిధిలోని సీఈఐ ఆటో మోటివ్ ఇండయా పరిశ్రమలో ఈ నెల 5వ తరీఖున జరుగనున్న ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం కర్మాగారంలో గేట్ మీటింగ్‌ను ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికుల కోసం నిరంతరం కృషి చేసి కార్మికుల హక్కులకు పాటుపడుతున్న సిఐటియును బలపర్చాల్సిన అవసరం కార్మికులపై ఉందని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలవగానే మంచి వేతన ఒప్పందం చేయడం జరుగుతుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయడం, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఆయా కర్మాగారాల్లో కార్మికులకు మంచి వేతన ఒప్పందం, కార్మికులకు అనేక సౌకర్యాల ఏర్పాటుకు సిఐటియు చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో సిఐఈ ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి, సిఐటియు క్లస్టర్ కన్వీనర్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ మహిపాల్, ఆయా పరిశ్రమల యూనియన్ నాయకులు రాజిరెడ్డి, నర్సయ్య, వంశీ, నారాయణ, రాజు, పాషా తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై సమీక్ష

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్‌లో మిక్కిలినేని మను చౌదరి శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. పాఠశాలల అధునీకరణకు సంబంధించి చేపట్టిన పనుల ఎంబిలను సకాలంలో అందించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈఈఈలు ఎంబిలను సబ్మిట్ చేయడంలో దృష్టి సారించాలన్నారు. ఇప్పటి వరకు మంజూరైన పనులు అందులో పూర్తైన పనుల వివరాలను కలెక్టర్ వాకబు చేయడంతో పాటు వీలైనంతగా త్వరగా మంజూరు ఇచ్చిన పనులను పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాశాఖ, ఆర్అండ్‌బి, పిఆర్ అధికారులు పాల్గొన్నారు.

## టెలికాం బోర్డు మెంబర్‌గా మొగుల్ల మల్లేశం

**మిరుదొడ్డి, అక్టోబరు 4,ప్రభాతవార్త :** టెలికాం బోర్డు మెంబర్‌గా మొగుల్ల మల్లేశం నియామకంమయ్యారు. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు మొగుళ్ళ మల్లేశం టెలికాం బోర్డు మెంబర్‌గా భారత ప్రభుత్వం నియమించారు. గతంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో చురుగ్గా పాల్గొన్నారు. అలాగే బిఎంఎస్‌లో పని చేశారు. బిజెపి మిరుదొడ్డి మండల అధ్యక్షునిగా,ఉమ్మడి మెదక్ జిల్లా కిసాన్ మోర్చా ప్రబారిగా జిల్లా మజ్దూర్ సెల్ కన్వీనర్‌గా జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. తన నియామకానికి సహకరించిన మెదక్ ఎంపి రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 4, ప్రభాతవార్త :**

నిత్యం కంప్యూటర్లతో కుస్తీ పట్టే ఇంజనీరింగ్ విద్యార్థులు బతుకమ్మ ఆటా పాటలతో హోరెత్తించారు. కోలాటం ఆడుతూ సందడి చేశారు. ఆధునిక వస్త్రదారణపై మక్కువ చూపే విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో తళుక్కుమన్నారు. సిద్దిపేట శివారులోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాటలకు అనుగుణంగా లయబద్ధంగా చేతులు కదుపుతూ బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.పి.రాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బెనర్జీ, పిఆర్ఓ బొడ్డు రఘు,ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ స్ఫూర్తి కిరణ్మై,మానస, శ్రీలత, త్రివేణి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న విద్యార్థులు

## వ్యభిచార కూపంలో పట్టుబడిన ప్రభుత్వ టీచర్

**పరారీలో హోమియోపతి డాక్టర్**

**విటురాలితో పాటు మరో 3 ముగ్గురు విటులపై కేసు నమోదు**

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 4, ప్రభాతవార్త :**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ చంద్రమౌళి ఇంటిలో నిర్వహిస్తున్న వ్యభిచార కూపంలో ఓ ప్రభుత్వ టీచర్‌తో పాటు మరో ముగ్గురు పట్టుబడగా హోమియోపతి డాక్టర్ పరాపోయిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సిద్దిపేట టాస్క్‌ఫోర్సు పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రమౌళి ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. వ్యభిచార కూపంలో బూర శ్రీనివాస్(ప్రభుత్వ టీచర్), మోతె వెంకటేష్, కొత్తపల్లి శంకర్, మిద్దె ప్రసాద్, ఉడకం చంద్రమౌళి హోమియోపతి డాక్టర్‌తో పాటు ఓ విటురాలు పట్టుబడినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. హోమియోపతి డాక్టర్ ఉడకం చంద్రమౌళి పరాలో ఉన్నట్లు తెలిపారు. విటులు, విటురాలు నుంచి రూ.2 వేల నగదు, 6 సెల్‌ఫోన్స్, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వ్యభిచార కూపంలో పట్టుబడిన విటులు



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు(ఇన్‌సెట్‌లో గాయత్రిదేవి అలంకరణలో విద్యాసరస్వతి అమ్మవారు)

## గాయత్రిదేవిగా దర్శనమిచ్చిన శ్రీవిద్యాసరస్వతి అమ్మవారు

**వర్గల్, అక్టోబరు 4 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని శంభుగిరి కొండలపై కొలువుదీరి భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న శ్రీవిద్యా సరస్వతి అమ్మవారి క్షేత్రంలో శరన్నవరాత్రి మహోత్సవం రెండవ రోజు శుక్రవారం అత్యంత వైభవంగా కొనసాగింది. ఉదయం నుండి మొదలుకొని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు,అలంకరణ, పూజలు నిర్వహించగా విద్యా సరస్వతి అమ్మవారు భక్తులకు గాయత్రిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సికింద్రాబాద్, హైద్రాబాద్ జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేయడంతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలను, మహా ప్రసాదం అందజేశారు.

## దసరా పండుగకు ప్రత్యేక ఆర్టీసి బస్సులు : ఆర్‌ఎం



ఉత్తమసేవలందించిన కండక్లర్, డ్రైవర్లను సన్మానిస్తున్న ఆర్‌ఎం ప్రభులత

**జహీరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. శుక్రవారం జహీరాబాద్ డిపోను సందర్శించి ఉత్తమ సేవలు అందిస్తున్న కండక్లర్, డ్రైవర్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ సదర్భంగా ఆర్‌ఎం ప్రభులత మాట్లాడుతూ ఆర్టీసి సిబ్బంది ప్రయాణీకులతో స్నేహ పూర్వకంగా మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ఆర్‌టిసి సేవలను ప్రతి ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్బంగా డిపోలో బ్యాట్మెంటన్ కోర్టును ఆర్‌ఎం ప్రారంభించారు. గ్యారేజ్ ఆవరణలో మొక్కలు నాటారు. డిపో మేనేజర్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి డిపోకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, ఇంజనీర్ తిరుమలేష్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మొగులయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలి : ఎస్‌ఐ



జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ నారాయణగౌడ్

**చిన్నశంకరంపేట, అక్టోబరు 4,ప్రభాతవార్త:** క్రీడలు, మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని, క్రీడా స్ఫూర్తితో పోటీల్లో క్రీడాకారులు పాల్గోనాలని ఎస్‌ఐ నారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధి కామారం గ్రామంలో పాపయ్యగారి సంగారెడ్డి గారి స్మారకార్థం ఆయన కుమారులు రామ్‌రెడ్డి, రాజిరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు.క్రీడలు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతాయన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూనే ఆరోగ్యాన్ని కూడ కాపాడుకోవాలని ఆయన తెలిపారు. యువకులు ప్రతి రోజు కొంత సమయాన్ని క్రీడలకు సూచించాలని తెలిపారు.

## కొనసాగుతున్న డిజిటల్ సర్వే



కామారం గ్రామంలో డిజిటల్ సర్వే చేస్తున్న అధికారులు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:** మండల పరిధి కామారం గ్రామంలో పైలట్ సర్వే కింద చేపట్టిన ఫ్యామిలి డిజిటల్ కార్డు సర్వే రెండవ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు ఇంటింటికి తిరిగి కుటుంబసభ్యుల వివరాలను సేకరించారు. డిజిటల్ సర్వేను పకడ్బందీగా, ఎలాంటి తప్పోప్పులకు తావు లేకుండా చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపివో గిరిజా రాణి డిజిట్ సర్వేను పరిశీలించారు.

## యోగాతో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, అక్టోబరు 4, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరి జివితంలో యోగా భాగస్వామ్యం కావాలని, యోగా మన మనస్సునే కాదు, శరీరాన్ని కూడ ఆరోగ్యంగా ఉంచుతుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ముదిరాజ్ భవన్‌లో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5వ రాష్ట్ర స్థాయి యోగ పోటీలను శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక మరియు మానసీక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుడం, ఆరోగ్యాన్ని పొందడం, జీవన నాణ్యతను మెరుగుపర్చుడం వంటి అనేక ప్రయోజనాల కారణంగా యోగ ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని అన్నారు. పాఠశాల స్థాయి నుండి యోగాపై శ్రద్ధ పెరిగేలా కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన యోగా అభ్యసనాలు అదరిని ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ మాజీ చైర్మన విజయ్ కుమార్, తులసీ దాస్,కమార్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్‌రావు,ప్రధాన కార్యదర్శి కృపాకర్, జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.



యోగా చేస్తున్న విద్యార్థులు

# విజయం కోసం సంఘర్షణ తప్పదు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 4) :** జీవితమే ఒక సంఘర్షణ అని, నిత్యం ఏదో ఒక రకంగా సమాజంలో సంఘర్షణ పడుతూనే ఉంటామని క్రీడల్లో కూడా యువకులు తమ సత్తా చాటాలని గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులు లక్ష్యం గురి తప్పకూడదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ యువ నాయకుడు నందారం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి టెన్నిస్, వాలీ బాల్, క్రికెట్ పోటీలను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలను స్నేహపూరిత వాతావరణంలో ఆడుకోవాలని, క్రీడల వల్ల ప్రాంతాల మధ్య, వ్యక్తుల మధ్య సానిహిత్యాన్ని పెంచాలే కానీ విభేదాలు వచ్చేలా ఉండకూడదని అన్నారు. ఒక ప్రాంతం పేరు చరిత్రలో ఉండాలంటే క్రీడలు దోహదపడతాయన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రీడలను ఆడడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అన్నారు. పురాతన కాలం నుండే క్రీడలకు ఒక ప్రాధాన్యముందన్నారు.

**మానవసేవలో తరిస్తున్న నందారం అశోక్ యాదవ్**

మానవసేవే మాధవ సేవ అంటూ తమ పార్టీ యువ నాయకుడు నందారం అశోక్ యాదవ్ ఇతరులకు స్పూర్తిగా, సమాజానికి ఒక ఆదర్శవంతంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఇటీవల కాలంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా తనను ఎంతగానో ఆకట్టుకున్నాడని అశోక్ యాదవ్‌ను ప్రశంసించారు. రంగంపల్లి గ్రామానికి చెందిన రైతుకు ఒక ఆవును ఇప్పించి తన దాతృత్వాన్ని చాటుకున్నాడని అభినందించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా అశోక్ యాదవ్ వెంటనే ముందుగా స్పందించడం గొప్ప విషయమన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, వ్యాపార పరంగా అశోక్ యాదవ్ మరింత అభివృద్ధి సాధించాలని, ఈ టోర్నమెంట్‌ను ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నందుకు పలువురు అశోక్ యాదవ్‌ను అభినందించారు.

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి బౌలింగ్ - అంజయ్య యాదవ్ బ్యాటింగ్**

ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లలో ఇరుజట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీకి స్థానిక మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ టాస్ వేశారు. టోర్నమెంట్‌ను ప్రారంభించే క్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బ్యాటింగ్ చేయగా, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి బౌలింగ్ వేశారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ క్రికెట్‌ను ఉద్దేశించి చలోక్తులు విసిరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, సీనియర్ నేతలు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ బచ్చలి నరసింహులు, మహ్మద్ అజాజ్ (అద్దు), సుధీర్, మహేష్, శివ, కబీర్, మున్నా, పాల్గొన్నారు.

# ఆమనగల్లులో వైభవంగా దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు

**ఆమనగల్లు, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలో దేవిశరన్న వరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. పట్టణంలోని శ్రీకన్యకపరమేశ్వరి ఆలయంలో రెండవరోజు అమ్మవారు భక్తు లకు ధనలక్ష్మి రూపంలో దర్శనం ఇచ్చింది. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించి పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రాంమోహన్‌గుప్త అధ్యక్షతన ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండవరోజు వివిధ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. దేవిశరన్నవరాత్రి ఉత్సవాల సంధర్బంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. కన్యకపరమేశ్వరి ఆలయంలో భక్తులు బికుమాండ్ల పాండయ్య, బికుమాండ్ల రంగయ్యగుప్త, చంద్రశేఖర్‌గుప్త, నటరాజ్ యాదయ్యగుప్త, బికుమాండ్ల శ్రీనివాస్, కండె లింగయ్య, శ్రీనివాస్, కొట్ర మల్లేశ్, బికుమాండ్ల నర్సింహ్మగుప్త, కండె సుమన్, అర్థం లక్ష్మయ్య ఉన్నారు.

**మార్కేండేయ దేవాలయంలో.....**

పట్టణంలోని గుర్రంగుట్టపై గల మార్కేండేయ దేవాలయంలో దేవిశ రన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ నేతృత్వంలో ఉత్సవాలు కొనసాగుతుండగా శుక్రవారం భక్తిశ్రద్దలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వ హించి అమ్మవారికి పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంగలి బాలకృష్ణ, ఎంగలి రమేశ్, భీమనపల్లి దుర్గయ్య, దోర్నాల ఈశ్వరయ్య, చెరుకు రవి, మామిడిశెట్టి రవి, అప్పం శ్రీను, బావండ్ల శంకర్, పాలాది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



దేవాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

## గ్రామావృద్ధికి కృషి చేస్తాం : మాజీ సర్పంచ్‌లు

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 4,ప్రభాతవార్త :**

సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్‌లో శుక్రవారం మాజీ సర్పంచ్ ఎర్ర యాదమ్మ 8వ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని వృద్దులకు అమె జ్ఞాపకార్థం దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్ర ప్రకాష్, ఎర్ర విజయ్‌కుమార్, ఈశ్వరయ్య పాల్గొని మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దేవేందర్‌రెడ్డి, గోపని లక్ష్మీమల్లయ్య, రాజమహమ్మద్, గజ్జల ఎల్లయ్య, బిడిఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బెట అనంద్, ఎంహెచ్‌పిఎస్ జిల్లా కన్వీనర్ షేక్ దస్తగిరి, కోటగిరి పాపయ్య, కాంగ్రెస్‌పార్టీ నాయకులు దుబ్బ దుర్గయ్య, ఎర్ర కృష్ణ, దేవయ్య, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడాల కనకయ్య, గోపాని చంద్రం, ఎర్ర సుధాకర్, దబ్బెట దాసు,స్వామి, కనకరాజు,భగవాన్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానసికోల్లాసాన్ని క్రీడలు దోహదం

**డిఎల్‌డిఏ మాజీ చైర్మెన్ పి,నారాయన్‌రెడ్డి**

**పెద్దేముల్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుడ్యాన్ని పెంపొందిస్తాయని డిఎల్‌డిఏ మాజీ చైర్మెన్ పి,నారాయన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిట్టెపు ప్రకాష్‌రెడ్డి మెమోరియల్ టోర్నమెంటు (సీపీఆర్) ను పి.నారాయన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగాపి,నారాయన్‌రెడ్డి మాట్లాడుతూ విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవితానికి ఎన్నోపాఠాలు నేర్పిస్తాయని అన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా మనలో భాగస్వామ్యం అయినప్పుడు పరిపూర్ణత గల మనిషిగా అభివృద్ధి చెందుతారనిఅన్నారు. సీపిఆర్ టోర్నమెంటులో 30 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వహకులు చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మెన్ జితేందర్ రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్ గుప్తా, మాజీ సర్పంచ్‌లుఎర్రబాలప్ప, కిషన్‌రావు, ఇందూరు ప్రకాష్, మాజీ యంపిటిసి విద్యాసాగర్, నాయకులు నరేష్‌రెడ్డి, శిబ్లి, డివై నర్సిములు, బంగ్ల రఘు, డివై ప్రసాద్,మాధవరెడ్డి,విఠల్, ఆర్గనైజర్స్ వెంకటేష్, మతిన్, అఖిల్, ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సేవ చేయడం అభినందనీయం

**పెద్దేముల్, అక్టోబరు 4, ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి పేదలకు సేవ చేయడం అభినందనీయమని మాజీ జడ్పిటిసి ధారాసింగ్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం గాజీ పూర్‌లో కాంగ్రెస్‌పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సిములు (ఎల్ఎన్ఆర్) సహకారంతో వికారాబాద్ మహవీర్ జనరల్ ఆసుపత్రి అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ధారాసింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ ఆరోగ్య స్థితిగతులపై పరిక్షలు నిర్వహించుకోవాలని, అలాంటి వాతవరణం కల్పించేందుకుఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఉచిత వైద్య శిబిరంలో తలనొప్పి, బీపీ,షుగర్,తిమ్మిర్లు వంటి వైద్య పరిక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. మాజీ కో ఆప్షన్ సభ్యులు నసీర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్, మహవీర్ ఆసుపత్రి డాక్టర్లు సంకీర్తన, సాయిస్మరణ, శ్రీకాంత్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి లాల్‌రెడ్డి, వెంకటేశం, క్రిష్ణ పాల్గొన్నారు.

## అంతర్గతరోడ్ల అభివృద్ధికి నిధులు: చైర్‌పర్సన్

**ఘట్‌కేసర్, అక్టోబరు 4, ప్రభాతవార్త:**

పట్టణంలోని పలు కాలనీల్లో అంతర్గత రోడ్లను సిమెంట్‌రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయి స్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 10వ వార్డులో ఆమె సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మున్సిపల్ నిధులు రూ.10 లక్షలతో బాలాజీనగర్‌లో చేప డుతున్న సిసి రోడ్డుకు చైర్‌పర్సన్ కొబ్బరికాయలు కొట్టి పనులు మొదలుపెట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రోడ్లను 4 నెలలలో పూర్తి చేయించేందు కృషి చేస్తూన్నామన్నారు. పట్టణంలో దెబ్బతిన్న అంతర్గత రోడ్లను సిమెంట్, బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేస్తున్నామని తెలిారు. ఈసందర్భంగా కాలనీనాయకులు ప్రజాప్రతినిధులు, నాయ కులను శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, కౌన్సిలర్లు బర్ల శశికళ, కుతాడి రవీందర్, మాజీ వార్డుసభ్యులు కొరుబోతు నాగరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయులు రంగయ్య, నాయకులు కేశవపట్నం అంజనేయులు, బర్ల రాధాకృష్ణ, శశి ధరణ్, దంతూరి గోపాల్‌గౌడ్, నాగభూషణంచారీ, సార శ్రీనివాస్‌గౌడ్, గొంకంటి రవీందర్, సురేశ , ప్రణయ్‌కుమార్, అబ్బసాని పొనన్నయ్య, రమేశ్, ప్రవీణ్, మల్లేశ్, అమర్, నందు, కంది లింగంతదితరులు.

## గాయత్రి దేవి అవతారంలో అమ్మవారు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 4,ప్రభాతవార్త:** దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా రెండవ రోజు దుర్గాదేవి అమ్మవారు సకలవేద స్వరూపిణి గాయత్రి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు.

## ఘనంగా దుర్గామాత ప్రతిష్టా పూజలు



పూజలో పాల్గొన్న పావని జంగయ్య, మహేశ్‌గౌడ్, ముత్యాలుయాదవ్

**ఘట్‌కేసర్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో దుర్గామాత విగ్రహ ప్రతిష్టా పూజలు ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్, కొండాపూర్, ఎన్‌ఎఫ్‌సీనగర్, చౌదరిగూడ, మక్తా, వెంకటాద్రిటౌన్‌షిప్, వెంకటాపూర్ తదితర చోట్ల ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో దుర్గా మాతను ఏర్పాటు చేశారు. ఘట్‌కేసర్ ఎదులాబాద్ రోడ్డు నాగులమ్మ దేవాలయం వద్ద మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో దుర్గామాతను ప్రతిష్టించారు. మండపంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్‌లు విచ్చేసి దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్లు బర్ల శశికళ, కడుపొల్ల మల్లేశ్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, కొరుబోతు నాగరాజు, విబి. వెంకట నారాయణ, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, మేడ్చల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొమ్మిడి శివ ప్రదీప్‌రెడ్డి, కార్యదర్శి మామిండ్ల కార్తీక్‌యాదవ్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు సాయిచరణ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు కేశవ పట్నం అంజనేయులు,శశిధరణ్, లోకేశ్‌నాయక్, సోమసాని వెంకటేశ్, దంతూరి గోపాల్‌గౌడ్, కె.సత్యనారాయణ, గోదాసురేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా దేవీ నవరాత్రులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 4) :** హిందువుల ప్రధాన పండుగలలో విజయ దశమి ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా ఈ పండగను ఎంతో ఘనంగా జరుపుకుంటారు. షాద్‌నగర్ పట్టణంలోని జానంపేట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దుర్గామాత దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం నవరాత్రుల ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు పరిశీలించారు. ప్రతి రోజు అమ్మవారికి నైవేద్యం, తీర్థ ప్రసా దాలు, అన్నదాన కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. శరన్నవరాత్రులలో అమ్మవారిని ఒక్కో రోజు ఒక్కో విధంగా అలంకరించి పూజిస్తారని బక్కని అన్నారు. నవరాత్రుల్లో అమ్మవారిని పూజించడం ద్వారా పది జన్మల పాపాలు తొలగిపోతాయని ప్రజలు విశ్వసిస్తారన్నారు. కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిశోర్, కౌన్సిలర్ ప్రతాప్ రెడ్డి, భక్తులు భూపాల్‌పాల్గొన్నారు.

## చౌడాపూర్‌లో దేవి నవరాత్రి ఉత్సవాలు

**చౌడపూర్ అక్టోబరు 4, ప్రభాతవార్త :**

విజయదశమి పండుగను పురస్క రించుకొని దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చౌడపూర్ మండల కేంద్రం లోని శివాలయ ప్రాంగణంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించి ,తొలి రోజు శైలపుత్రి మాతగా,రెండో రోజు గాయత్రి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

## దుర్గామాతకు ప్రత్యేక పూజలు

**కొడంగల్, అక్టోబరు 4 ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణంలోని సిటిజన్ క్లబ్ ప్రాంగణంలో ప్రతిష్టించిన దుర్గామాత అమ్మవారికి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు.దసరా దేవి నవరాత్రుల సందర్బంగా సనాతన ధర్మరక్షణ సమితి అద్వర్యంలో ఈనెల12వ తేది వరకు అమ్మవారికి నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సనాతన ధర్మరక్షణ సమితి అధ్య క్షులు కొట్రికె లక్ష్మీనారాయణ తెలిపారు దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపనకు మున్సిపల్ చైర్మేన్ ఆర్. జగదీశ్వర్‌రెడ్డి,మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



డీఆర్‌డివో శ్రీనివాస్‌రావు

## వార్షిక ప్రణాళిక సిద్దం చేసుకోవాలి

**చిన్నశంకరంపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:** 2025-26 సంవత్సరంలో ఈజీఎస్ ద్వారా చేపట్టే పనులకు వార్షిక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఆర్డీవో శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాలలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజారాణి, ఏపీవో రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు, అక్టోబరు 4, ప్రభాతవార్త:** సద్దుల బతుకమ్మ పర్వదినం పురస్కరించుకొని ఈ నెల 10వ తేదిన పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై నిర్వహించబోయే బతుకమ్మ సంబరాల ఏర్పాట్లను శనివారం ఉదయం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ప్రధానంగా బతుకమ్మ ఘాట్‌వద్ద మహిళల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ ప్రతి ఏటా సాకి చెరువు కట్టపై సద్దుల బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.వివిధ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ గాయని,గాయకులచే సంగీత విభావరి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్,ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడతా



మాట్లాడుతున్న పట్లోళ్ల రాఘవేందర్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 4 ప్రభాతవార్త :** ప్రజాసేవలో అనుభవంఉన్న తనను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే నిరుద్యోగ పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని ప్రైవేట్ పాఠశాలల సంఘం (ట్రస్మా) రాష్ట్ర కోశాధికారి పట్లోళ్ల రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండలకేంద్రంలోని ది మాస్టర్ మైండ్ ఉన్నత పాఠశాలలో గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను స్వతంత్ర అభ్యర్థిగా మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తానని తెలిపారు. తాను ఉమ్మడి మెదక్ జిల్లాలోని పటాన్‌చెరు పిఎసిఎస్ చైర్మన్‌గా, మెదక్ డిసిసిబి డైరెక్టర్‌గా పనిచేస్తూ ప్రజలకు అంకితభావంతో అనేక సేవలు అందించానని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కూడా మెదక్ జిల్లాలో చురుకుగా పాల్గొని తెలంగాణ సాధనకు తనవంతు కృషి చేశానని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల సంఘంలో అనేక స్థాయిల్లో పనిచేసిన అనుభవం ఉందని, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలతో సత్సంబంధాలు ఉన్నాయని, తనను రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటువేసి గెలిపిస్తే పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యలతో పాటు ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పట్టభద్రులు నవంబర్ 6వ తేదీలోపు పట్టభద్రుల ఓటు కొరకు అంతర్జాలంలో నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ మైండ్ పాఠశాల సిబ్బంది అక్కారం నర్సింలు, తీగుల్, గజ్వేల్, అక్షర పాఠశాల కరస్పాండెంట్ గుర్జకుంట రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సభ్యత్వాల నమోదు ప్రక్రియ పరిశీలన



మాట్లాడుతున్న మెదక్ బిజెపి సభ్యత్వ ఇంచార్జి మురళిగౌడ్

**చిన్నశంకరంపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:** పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన సమయంలో పార్టీ గుర్తింపు ఇస్తుందని బిజెపి రాష్ట్ర నాయకులు, మెదక్ బిజెపి సభ్యత్వ ఇంచార్జి మురళిగౌడ్ తెలిపారు. శుక్రవారం నాడు చిన్నశంకరంపేట పట్టణంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ అసెంబ్లీ కన్వీనర్ రామ్మోహన్ గౌడ్, దశరథం, శ్రీనివాస్, ఆకుల రాజు, సుధాకర్, దేవరాజ్‌లు పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాల్లో నాణ్యమైన విద్య

**చిన్నశంకరంపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ప్రభుత్వ కళాశాలలో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ తెలిపారు. శుక్రవారం చిన్నశంరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రెషర్స్ పార్టీలో ఆయన పాల్గొని కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికారు. కళాశాలలో అనుభవంగల అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రతి అధ్యాపకులు కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు. గత ఏడాది నవంబర్ వార్షిక ఫలితాలలో ఉమ్మడి జిల్లాలోనే మన ప్రభుత్వ కళాశాల మొదటి స్థానంలో ఉందని, దానిని అలాగే కొనసాగించే విధంగా కష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ శశిధర్


సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**మనూర్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** రైతులు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మనూర్‌లో మార్కెట్ గోదాంలో ఏర్పాటుచేసిన సోయాబీన్ కొనుగోలుకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయాబీన్‌ను రూ. 4892 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవ నూతన్ కుమార్, ఏఓ మహేష్ చౌహాన్, ఏఈఓ సంగమేశ్వర్, కొనుగోలు కేంద్రం అధికారులు స్వప్న, శ్రీకాంత్, నాయకులు, మాజీ సర్పంచులు దిగంబర్‌రెడ్డి, సిద్దారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్, అశోక్‌రావు, శివాజీరావు, రైతులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతను పాటిద్దాం ఆరోగ్యంగా జీవిద్దాం : ఎంపిడిఓ


చీకూర్తిలో పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ రాజశేఖర్ కవ్‌లాస్

**న్యాల్‌కల్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా జీవించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎంపిఓ రాజశేఖర్ కవ్‌లాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చీకూర్తి, హుస్సేన్ నగర్ గ్రామాలను ఎంపిఓ సురేశ్‌తో కలిసి పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని పంచాయితీ కార్యాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లోని డంపింగ్ యార్డులను పరిశీలించి పంచాయితీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

## తోపుగొండలో డిజిటల్ సర్వేను పరిశీలించిన తహసీల్దార్


డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి రాథోడ్

**కంది, అక్టోబరు 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తోపుగొండ గ్రామంలో కొనసాగుతున్న డిజిటల్ సర్వేను తహసీల్దార్ శుక్రవారం పరిశీలించారు. డిజిటల్ సర్వేకు తోపుగొండ గ్రామాన్ని ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేసిన విషయం పాఠకులకు విధితమే. గ్రామంలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ మహేందర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి కళాశాలలో బతుకమ్మ సంబరాలు

-పాల్గొన్న టిజి ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మ వేడుకలను టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వేడుకల్లో పాలుపంచుకున్నారు. వేడుకలకు హాజరైన నిర్మలజగ్గారెడ్డి ప్రిన్సిపాల్ సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి, కౌన్సిలర్ కూన వనిత సంతోష్, మహిళా కాంగ్రెస్ నాయకులు అనుసూజ, మార్కెట్ కమిటి సభ్యులు యశోధ, జ్యోతి, మంగా, విజయ పాల్గొన్నారు.

## ఝరాసంగంలో పారిశుధ్య పనుల పరిశీలన

**ఝరాసంగం, అక్టోబరు 4, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు కుప్పానగర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన డ్రై డే ఫ్రైడే పనులను ఎంపిడిఓ సుధాకర్ పరిశీలించారు గ్రామాల్లో పర్యటించి ప్రతి ఒక్కరూ పరిశుభ్రను పాటించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి హర్షవర్ధన్‌రెడ్డి, ఏపిఓ రాజ్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి సరస్వతి, పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు బోరు ఏర్పాటు


పెద్దారెడ్డిపేటలో బోరును త్రవ్విస్తున్న కాంగ్రెస్ నేత లింగయ్య

**పుల్‌కల్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో గ్రామస్థులు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడి పరిష్కారానికి కాంగ్రెస్ నేత కుమ్మరి లింగయ్య సొంత ఖర్చులతో బోరును డ్రిల్ చేయించారు. గ్రామంలోని కొత్త కాలనీవాసులు తాగునీరు అందక గొంతులు ఎండుతున్నాయని, తామెదుర్కొంటున్న సమస్యను లింగయ్య దృష్టికి తేగా స్పందించిన లింగయ్య బోరును డ్రిల్ చేయించారు. డ్రిల్ చేసిన బోరు నుంచి నీరు సమృద్ధిగా లభ్యం కావడంతో కాలనీ వాసుల ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. బోరును త్రవ్వించిన కుమ్మరి లింగయ్యను కాలనీ వాసులు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## సామూహిక కుంకుమార్చనలు..

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** పట్టణంలోని తిరుమలాపూర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణ మంత్రోచ్చరణలతో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పసుపు కుంకుమలతో సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా ఆర్య వైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాగం అర్చన, చకిలి విశాల, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్న మహిళలు

# ఆగిన సేవలు..ఆగమవుతున్న వినియోగదారులు

-4రోజులుగా బ్యాంక్ గేటుకు నో సిగ్నల్ బోర్డు
-ఫిర్యాదులకు స్పందించని అధికారులు


బ్యాంక్ వద్ద పడిగాపులుగాస్తున్న వినియోగదారులు(ఇన్‌సెట్‌లో నో సిగ్నల్ బోర్డు)

**అల్లాదుర్గం, అక్టోబరు 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియన్‌లో నాలుగు రోజులుగా ఆన్‌లైన్ సేవలు ఆగిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.దసరా పర్వదినాలు ప్రారంభం కావడంతో ప్రతి ఒక్కరూ నూతన వస్త్రాల కొనుగోలుతో పాటు ఖర్చులు పెద్దమొత్తంలో అవసరం అవుతాయి. భవిష్యత్తు అవసరాలకు బ్యాంకులో దాచుకున్న డబ్బులు విత్‌డ్రా చేసుకుందామని బ్యాంక్‌కు వెళితే ఆన్‌లైన్ సేవలు ఆగిపోవడంతో వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు. ఒకటి రెండు రోజులైతే సర్దుకోవచ్చు కాని ఏకంగా 4 రోజుల నుంచి బ్యాంక్‌లో ఇదే తంతు కొనసాగుతుండటం చూస్తుంటే బ్యాంక్ అధికారుల పనితీరును అవగమవుతోంది.సేవలు పునరుద్దరించేలా చర్యలు తీసుకోవాలని పలుమార్లు బ్యాంక్ అధికారులకు వినతి చేసినా ప్రయోజనం లేకపోయిందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్‌లో సేవలు అందుకునేందుకు గడిపెద్దాపూర్ గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల వినియోగదారులు నిత్యం బ్యాంక్‌కు చేరుకుని గేటుకు నో సిగ్నల్ బోర్డును చూసి నిరుత్సాహానికి గురవుతూ సిగ్నల్‌లు వస్తాయేమో అన్న ఆశతో బ్యాంక్‌లో పడిగాపులు కాస్తూ వస్తున్నారు. బ్యాంకులో తాకట్టు పెట్టి రుణాలు అందుకున్న వినియోగదారులు బంగారాన్ని విడిపించుకునే అవకాశం లేకుండా పోతోందని, ఆలస్యమైతే వడ్డీ భారం పెరుగుతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్‌లో ఆన్‌లైన్ సేవలు సక్రమంగా పనిచేసేలా జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని బ్యాంక్ వినియోగదారులు వినతి చేస్తున్నారు.


కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

**రామాయంపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త :** పట్టణంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 10 లక్షల మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పెద్దమ్మ దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. అంతకుముందు పెద్దమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పెద్దమ్మ ఆశీస్సులు ఉండాలని కోరారు. అనంతరం ఆయన ప్రొసీడింగ్ కాపీని ముదిరాజు నాయకులకు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రామాయంపేట ముదిరాజ్ సంఘం పెద్దలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ముదిరాజు సంఘం నాయకులు పోచమ్మల సిద్దరాములు, దేవుని నర్సింలు, రెడ్డమైన నరేష్, భూమా రమేష్, అక్కల మల్లేశం, బండి నందు, ముఖ్య సభ్యులు పెద్దస్వామి, సార్గు బాగయ్య, రొయ్యల కిషన్, సామల మల్లేశం, అక్కల మురళి, పొట్టి సందీప్, దేవుని రంజిత్ పాల్గొన్నారు.

## అమ్మవారి మహా అన్న ప్రసాదం వితరణ

**కొల్చారం, అక్టోబరు 4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మాత మండపం వద్ద శనివారం (నేడు) మహా అన్నదాన ప్రసాద కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్ఆర్ ఫౌండరన మన్నె సాయి చరణ్ హాజరు కానున్నారని తెలిపారు. కనుక ఎంఎస్ఆర్ యువసన సభ్యులు తప్పకుండా అన్న ప్రసాద కార్యక్రమలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నామన్నారు. సాయంత్రం 7.00 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, యువకులు, మహిళలు విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు.

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఘనస్వాగతం

**రామాయంపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త :**పట్టణంలోని జాతీయ రహదారి వద్ద శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఘన స్వాగతం లభించింది. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక ఆద్య గ్రాండ్ రెస్టారెంట్ హోటల్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. అనంతరం ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రామచంద్రంగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్‌లు దేమె యాదగిరి, చిలుక గంగాధర్, నాయకులు చౌదరి సుప్రభాతరావు, రమేష్‌రెడ్డి, డాకి స్వామి, జీడిపల్లి సత్యనారాయణ, దేవుని జయరాజ్, విప్లవ్‌కుమార్, మామిడి సిద్దరాములు, కోనాపూర్ విద్యాసాగర్, రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగా నరేందర్, భైరం కుమార్, చింతల స్వామితో పాటు వివిధ మండలాల నుండి వచ్చిన పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న చిన్నారి తమోజ్ఞవల్లి అభినయం

**వర్గల్, అక్టోబరు 4 (ప్రభాతవార్త):** శ్రీవిద్యాధరి క్షేత్రంలో శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక, నృత్య కళా ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన చిన్నారి సింగంశెట్టి తమోజ్ఞవల్లి చేసిన నృత్య కళా ప్రదర్శన సబికులచే శభాష్ అనిపించింది. గొల్లపల్లి లలిత ధనలక్ష్మి (లలిత ఫైన్ ఆర్ట్స్) వద్ద శిక్షణ పొందిన చిన్నారి భరతనాట్యంలో వివిధ ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొంది పలువురు ప్రముఖులచే ప్రశంసలు అందుకుంది. కాగా వర్గల్ క్షేత్రం వద్ద హిందోళ రాగం ఆది తాళంలో మామతు శ్రీ సరస్వతి పాట ద్వారా తన విశేష అభినయాన్ని ప్రదర్శించి అమ్మవారి ఆశీస్సులు అందుకుంది. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చిన్నారి తమోజ్ఞవల్లిని అమ్మవారి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు.

## మృతుడికి నివాళులర్పించిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

**కొమురవెల్లి, అక్టోబరు 4,ప్రభాతవార్త :** కొమురవెల్లి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య, వాసవి నిత్యాన్న సత్ర కోశాధికారి ఇటీవల మృతి చెందడంతో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య నిత్యాన్న సత్రానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల దాడులు అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో న్యాయవాదులపై జరిగిన దాడిని హుస్నాబాద్ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హుస్నాబాద్ కోర్టు ముందు నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రోజు రోజుకి న్యాయవాదులపై పోలీసుల దాడులు పెరుగుతున్నాయని,ఈ దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయ వాదులపై దాడులు చేస్తున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


కోర్టు ఎదుట ఆందోళన చేస్తున్న న్యాయవాదులు



మాట్లాడుతున్న టిఎస్ న్యాబ్ డిఎస్పీ పుష్పకుమార్

## డ్రగ్ మహమ్మారిని తరిమికొడదాం

-టిఎస్ న్యాబ్ డిఎస్పీ పుష్పకుమార్

**జహీరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** డ్రగ్ మహమ్మారి నిర్మూలనలో యువత ముందుండాల్సిన అవసరం ఉందని టిఎస్ న్యాబ్ డిఎస్పీ పుష్ప కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మాస్టర్ మైండ్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిఎస్ న్యాబ్ డిఎస్పీ పుష్పకుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సినిమాల ప్రభావంతోనే యువత చెడు మార్గంలో పయనిస్తున్నారని, సినిమాల్లోని ప్రదర్శించే చెడుకు యువత దూరంగా ఉండాలన్నారు విద్యార్థి దశ భవిష్యత్తుకు ముఖ్యమని గుర్తు చేశారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకుంటే భవిష్యత్తు బంగారు మయం కావడం తధ్యమన్నారు. నూతన చట్టాల పట్ల యువత అవగాహన పొంది ఉండాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌న్యాబ్ సిఐ రాము నాయక్, స్థానిక పట్టణ ఎస్ఐ ఎం కాశీనాథ్, జాగృతి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుభాష్‌రెడ్డి మహిళా ఎస్ఐ హారిక, మాస్టర్ మైండ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డిజిటల్ కార్డుకోసం ఇంటింటా సర్వే


ఇంటింట ఫ్యామిలీ సర్వే చేస్తున్న అధికారులు

**జోగిపేట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్మాత్మకగా చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుకోసం ఆర్డీవో పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్ ఆకుల సత్యనారాయణల ఆధ్వర్యంలో శుక్రవారంనాడు ఇంటింటి సర్వే చేపట్టారు. జోగిపేట మున్సిపాలిటి పరిధిలో 17వ వార్డును ఇందుకోసం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికచేసి, ఆ వార్డులో ఇంటింటి సర్వే ప్రారంభించారు. రెండు బృందాలు ఏర్పాటుచేసి ఇంటింటి సర్వే చేపట్టారు.

## దుర్గాభవాని మాత మండపం వద్ద అన్నదానం

**జోగిపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జోగిపేటలోని పబ్బతి హనుమాన్ చౌరస్తాలో సిరి, స్నేహ యూత్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాభవాని మాత మండపం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ సంవత్సరం ఇక్కడ దుర్గాభవాని మాత విగ్రహాన్ని ఉంచి నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతినిత్యం ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించటంతోపాటగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపడతారు. అందులో భాగంగా ఈరోజు అన్నదానం చేపట్టారు. ఇందులో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖలో సిబ్బంది సంఖ్యను పెంచాలి



కుకునూరుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయం

**కొండపాక, అక్టోబరు 4, ప్రభాతవార్త :** రెవెన్యూ శాఖలో క్యాడర్ స్ట్రెంత్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనేచేపట్టాలని కుకునూరుపల్లి మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సౌలభ్యం కోసం, ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ప్రజల అభిప్రాయం మేరకు జిల్లాలో మూడు కొత్తగా మూడు మండలాలను ఏర్పాటు చేస్తూ వాటిలో రెవెన్యూ తహసీల్దార్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. సిద్దిపేటజిల్లాలో కొత్తగా ఏర్పాటుచేసిన కుకునూరుపల్లి, దూల్‌మిట్ట, అక్బర్‌పేట-భూంపల్లి మూడు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్‌తోపాటు మరో 12 మంది సిబ్బందిని ఇతర కార్యాలయాల నుండి కొత్తగా ఏర్పాటు చేసిన కార్యాలయాలకు సర్దుబాటు చేశారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండలాలను క్యాడర్ స్ట్రెంత్(ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అప్రూవుడ్) చేయక మందే ఎన్నికలు రావడంతో అ కార్యక్రమం నిలిచిపోయింది. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం రెవిన్యూ శాఖలో క్యాడర్ స్ట్రేంత్ కార్యక్రమాన్ని చేపట్టాలని అయా మండలాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఎద్దును తరలిస్తున్న ఆటోను అడ్డుకున్న బిజెపి నాయకులు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:**పట్టణానికి చెందిన ఓ దళారి శుక్రవారం ఓ రైతువద్ద రూ.15వేల ఎద్దును కొని బొలేరో వాహనంలో తరలిస్తున్నారనే సమాచారంతో బిజెపి మండలాధ్యక్షుడు రాజు, పట్టణా ధ్యక్షుడు ఆకుల రాజు వాహనాన్ని అడ్డుకున్నారు. రైతుతో మాట్లాడి ఎద్దును అతనికి అప్పగించారు. హిందువులు ఎంతో పవిత్రంగా పూజించే ఆవులను, ఎద్దులను మరోసారి విక్రయిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించి విడిచిపెట్టారు.


వాహనంలో ఎద్దును తరలిస్తున్న దృశ్యం



మగ్గం శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న దృశ్యం

## ఉచిత మగ్గం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా సంఘాల సభ్యులకు సర్టిఫికెట్ల అందజేత

**గుమ్మడిదల, అక్టోబరు 4 ప్రభాతవార్త:** వీరారెడ్డిపల్లి ఐకేపీ గ్రామ సమైఖ్య సంఘం ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి పెంపొందించుటకుగాను 25 మహిళా సంఘాల సభ్యులకు 20 రోజుల పాటు ఉచిత మగ్గం శిక్షణా కార్యక్రమాన్ని నాబార్డ్-వివేకానంద-ఎన్‌జీవో వారి సహకారంతో ఇవ్వడం జరిగింది. శిక్షణా సమయంలో సభ్యుల శిక్షణకు అవసరమైన క్లాత్, ఫ్రేమ్, థ్రెడ్స్, నిడిల్స్, మెటీరియల్స్, ఉచిత భోజన సదుపాయంతో పాటు ఒక్కొక్క సభ్యురాలికి 20 రోజులకు రూ.1,000 స్టైఫండ్ ఇవ్వడం జరిగింది. శిక్షణ తీసుకున్న సభ్యులు ప్రతినెలా కనీసం రూ.10,000 నుండి రూ.15,000 ఆదాయం సంపాదించే విధంగా ప్రణాళిక చేసుకోవాలని చెప్పడం జరిగింది. శుక్రవారం శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులకు నాబార్డ్ డీడీఎం నిఖిల్‌రెడ్డి కోర్సుకి సంబంధించిన సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది. అనంతరం గ్రామైఖ్య సంఘ కార్యాలయ ఆవరణలో నాబార్డ్ డీడీఎం నిఖిల్ రెడ్డి మొక్కలను నాటారు. కార్యక్రమంలో శ్రవణ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ డీసీసీబీ గుమ్మడిదల, శివకుమార్ ఏపీఎం, అలివేలు సీసీ, రేఖా వీవోఏ, షబానా ట్రైనర్, దశరథ్ ఎన్‌జీవో కోఆర్డినేటర్, శిక్షణ తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నవరాత్రి పూజలు

**మనూర్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** శరన్నవరాత్రి ఉత్సవాలను మండల కేంద్రమైన మనూర్‌తోపాటు మాయికోడ్, డవ్వూర్, రానాపూర్, బోరంచ తదితర గ్రామాల్లో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకుంటున్నారు. గ్రామాల్లోని ఆలయాల్లో, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న మంటపాల్లో అమ్మవారిని ప్రతిష్టించుకుని రోజుకో రూపంలో అమ్మవారిని అలంకరించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. మంటపాల వద్ద పూజా కార్యక్రమాల అనంతరం సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలకు చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేస్తున్నారు. మనూర్‌లో భవాని మాత అమ్మవారిని ప్రతిష్టించుకుని ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో నిత్యం పూజా కార్యక్రమాలు, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాలు భక్తితో శోభిల్లుతున్నాయి.

## గాయత్రి దేవిగా ఏడుపాయల వనదుర్గా భవాని మాత

**పాపన్నపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఏడుపాలయ వనదుర్గా భవాని మాత గాయాత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయంతోపాటు ఆలయ గోకుల్ షెడ్‌లో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలను అమ్మవార్లను గులాబీ రంగు వస్త్రాలతో బ్రహ్మచారిణి గాయత్రిదేవిగా అర్చకులు శంకర్‌శర్మ, పార్థివశర్మ, రాజశేఖర్‌శర్మ, రాజేష్‌శర్మ, ఫణిశర్మ, శైలేష్‌శర్మ, మురళీశర్మలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

**నేడు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం...**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన శనివారం తదియను పురష్కరించుకుని అమ్మవారిని నీలం రంగు చారతో చంద్ర ఘంట (అన్నపూర్ణ దేవిగా) అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు, ఆలయ ఇఓ చంద్రశేఖర్ తెలిపారు.

**కేతికి ఆలయంలో...**

**ఝరాసంగం, అక్టోబరు 4, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్దలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, రికార్డు అసిస్టెంటు రమేష్, శ్రావణ్ సింగ్ ఠాగూర్, భక్తులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కొల్చారం, అక్టోబరు 4 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి ఎండుగుల కృష్ణ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండుగుల కృష్ణ దంపతులు సునితా లక్ష్మారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్ గుప్త, యువత విభాగం అధ్యక్షులు కోనాపూర్ సంతోష్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ కుమార్, ముత్యంగారి సంతోష్ కుమార్, రంగంపేట సొసైటీ వైస్ చైర్మన్ మెతుకు మల్లేశం, పార్టీ సీనియర్ నేతలు నరేందర్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

**గుమ్మడిదల, అక్టోబరు 4 ప్రభాతవార్త:**మండలంలోని అనంతారం గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గాగిల్లాపూర్ ఎన్ఎస్ఎస్‌కేకే హైస్కూల్ యాజమాన్యం తరపున విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా యాజమాన్యం తరపున ఇనిస్టిట్యూట్ చైర్మన్, తోమాస్ సెక్రటరీ బాబు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర భవిష్యత్ కాలంలో వారిదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధైర్య పడకండి.. పార్టీ అండగా ఉంటుంది : ఎమ్మెల్యే

**కొల్చారం, అక్టోబరు 4 ప్రభాతవార్త:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొల్చారం మండలం రంగంపేట మాజీ సర్పంచి గోకని ధర్మాగౌడ్ కుటుంబసభ్యులను నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. అధైర్య పడొద్దని, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులు తాజా మాజీ ఎంపీటీసీ గోకని మాధవి రాజాగౌడ్‌కు ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి మనోధైర్యం కల్పించారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్ గుప్త, యువత విభాగం అ ధ్యక్షులు కోనాపూర్ సంతోష్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ కుమార్, ముత్యంగారి సంతోష్ కుమార్, రంగంపేట సొసైటీ వైస్ చైర్మన్ మెతుకు మల్లేశం, పార్టీ సీనియర్ నేతలు నరేందర్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులకు జర్నలిస్టుల వివరాలు అందజేత

**గుమ్మడిదల, అక్టోబర్ 4 ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్ చేత ప్రభుత్వ గుర్తింపు పొంది అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులకు మాత్రమే అధికారిక సమాచారాలను అందించాలని, అదే విధంగా మీడియా పేరుతో వరుసు అకృత్యాలకు పాల్పడుతున్న కొందరు వ్యక్తులపై తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పటాన్‌చెరు నియోజక వర్గం జర్నలిస్టులు అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం గుమ్మడిదల తహశీల్దార్, ఎస్ఐ, ఇతర ప్రభుత్వ అధికారులను కలిసి జర్నలిస్టులకు వృత్తి పరంగా ఎదురవుతున్న సమస్యలను విన్నవించి సహకరించాలని కోరారు. దీనికి ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల వివరాల లీస్టులను అధికారులను స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నారు.


అధికారులకు జర్నలిస్టుల వివరాలు అందజేస్తున్న దృశ్యం